సాక్షి సంగారెడ్డి

బుధవారం । 3 । జనవరి । 2024



సబ్సిడీపై 'డ్రిప్' అందేనా..!

కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా డ్రిప్ పథకం అమలు చేస్తారనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. డ్రిప్ పరికరాల పథకం పదేళ్లుగా నిలిచిపోయింది. వివరాలు 8లో ▸



'బడ్‌చిప్'.. బహుబాగు

చెరకు సాగులో బడ్‌చిప్ విధానం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వివరాలు 8లో ▸

9న సదరం శిబిరం

సంగారెడ్డి : ఈ నెల 9వ తేదీన పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో సదరం శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి గాయత్రీ దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్లాట్స్ 4వ తేదీన కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

అభివృద్ధి పథంలో వ్యవసాయ మార్కెట్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు : ఉమ్మడి మెదక్ జిల్లాలోనే పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ ఆదాయంలో మొదటి స్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పాలక మండలి సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 14 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్‌ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తున్నామని తెలిపారు. ఇటీవల రూ.23 కోట్లతో 160 దుకాణ సముదాయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఐదు కోట్ల రూపాయల లక్ష్యాన్ని ఇప్పటికే సాధించినట్లు తెలిపారు. రైతులకు కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మల్లారెడ్డి, డైరెక్టర్‌లు, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరికి కరోనా పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 20 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందులో ఇద్దరికి పాజిటివ్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 18 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

జాతీయ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ

సంగారెడ్డి : మహారాష్ట్ర అకోలాలో డిసెంబర్ 28న నిర్వహించిన జాతీయ స్థాయి బాక్సింగ్ టోర్నమెంట్‌లో పట్టణంలోని సోమేశ్వరవాడకు చెందిన శ్రీకాంత్ గౌడ్ విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయనను కోచ్ ఆనంద్ భాస్కర్ అభినందించారు.

బ్లాస్టింగ్ స్థావరంపై ఎస్‌ఓటీ దాడులు

రామచంద్రపురం(పటాన్‌చెరు): అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్న ప్రాంతంలో ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేసి నిర్వాహకుల నుంచి భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని తెల్లాపూర్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. కొల్లూరు ఇన్‌స్పెక్టర్ సంజయ్ తెలిపిన కథనం ప్రకారం.. తెల్లాపూర్ శివారులో బహుళ అంతస్తుల నిర్మాణ సంస్థకు సంబంధించిన భూమిలో సెల్లార్ కోసం తవ్వకాలు మొదలుపెట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా బ్లాస్టింగ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ పోలీసులు బ్లాస్టింగ్ చేపట్టిన ప్రాంతంపై మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. అక్కడ 41 జిలెటిన్ స్టిక్స్, 7 డిటోనేటర్లు, పేలుడుకు ఉపయోగించే వైర్బెండలు సుమారు రూ.6లక్షల 20 విలువైన సామగ్రిని సీజ్ చేసి కొల్లూరు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు కారకులైన అంజయ్య, రమేష్, సైదులు, జనార్ధన్, ప్రకాశంలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో డ్రైవర్ల నిరసన

మద్దూరు(హుస్నాబాద్): లద్నూరు గ్రామంలో మంగళవారం ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. రోడ్డుపై ఆటోలు అడ్డుపెట్టి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల మా బతుకులు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఫైనాన్సులు చెల్లించలేక కుటుంబాలను పోషించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించి కుటుంబాలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.



జహీరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంకు వద్ద క్యూ కట్టిన వాహనదారులు



నారాయణఖేడ్‌లో బ్లాక్‌లో పెట్రోలు విక్రయిస్తున్న వ్యక్తిని ప్రశ్నిస్తున్న పోలీసులు

బంకుల్లో బారులు

హిట్ అండ్ రన్ కేసుల విషయంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనను వ్యతిరేకిస్తూ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజులపాటు పెట్రోల్, డీజిల్ దొరకదనే ప్రచారం జరిగింది. దీంతో మంగళవారం వాహనదారులు బంకుల్లో బారులు దీరారు. వాహనాలు భారీగా క్యూ కట్టడంతో ఆయా మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. సంగారెడ్డి పట్టణంతోపాటు నారాయణఖేడ్, జహీరాబాద్, జోగిపేట, హత్నూర, రామచంద్రాపురం, ఝరాసంగం మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది.

– సంగారెడ్డి టౌన్ /నారాయణఖేడ్ /జహీరాబాద్/ హత్నూర(సంగారెడ్డి)/రామచంద్రాపురం (పటాన్‌చెరు)/ ఝరాసంగం(జహీరాబాద్)/ జోగిపేట(అందోల్)

సంగమేశ్వర, బసవేశ్వర పనులకు బ్రేక్..!

- మిషనరీని తరలించిన కాంట్రాక్టు కంపెనీ
- గత ఏడాది ఫిబ్రవరిలో పంప్‌హౌజ్ నిర్మాణానికి శ్రీకారం
- ఎన్నికల ఫలితాలు తర్వాత పూర్తిగా పనులు నిలిపివేత

నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం



బోరంచ వద్ద నిలిచిపోయిన బసవేశ్వర ఎత్తిపోతల పనులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పనులు నిలిచిపోయాయి. పది నెలల క్రితం ప్రారంభమైన సాగునీటి ఎత్తిపోతల పనులు నెమ్మదిగా సాగాయి. ఎన్నికల ఫలితాల అనంతరం ఈ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టు కంపెనీ పనులు జరుగుతున్న ప్రదేశం నుంచి యంత్రాలను కూడా తరలించింది. ఉద్యోగులు, సిబ్బందిని కూడా ఇక్కడి వెళ్లిపోయారు. బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనుల్లో భాగంగా సంగారెడ్డి జిల్లా మనూరు మండలం బోరంచ వద్ద పంప్‌హౌజ్ నిర్మాణం చేపట్టారు. సింగూరు ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు ఈ పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు 12 ఎకరాల్లో భూమిని చదును చేసిన కాంట్రాక్టు కంపెనీ, పంప్‌హౌజ్ కట్టేందుకు 13 మీటర్ల లోతులో తవ్వకాలు చేపట్టారు. ఎన్నికల ఫలితాల తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయి.

సంగమేశ్వర ఎత్తిపోతలకు సంబంధించి పంప్‌హౌజ్ నిర్మాణం పనులు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగపల్లి వద్ద 2023 మేలో షురువయ్యాయి. తవ్వకం పనులు కొద్ది మేరకు మాత్రమే జరిగాయి. ఈ పంప్‌హౌజ్ కోసం అవసరమైన భూములకు సంబంధించి పరిహారం ఎటూ తేలకపోవడంతో రైతులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ పనులు ఆరు నెలల క్రితమే నిలిచిపోయిన విషయం విధితమే.

సుమారు రూ.7 కోట్ల మేరకు చెల్లింపులు

బసవేశ్వర ఎత్తిపోతల పథకానికి సంబంధించి ఇప్పటి వరకు కాంట్రాక్టు కంపెనీకి రూ.పది కోట్ల మేరకు పనులు జరిగాయని నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో సదరు కంపెనీకి రూ.ఏడు కోట్ల వరకు చెల్లింపులు జరిగినట్లు పేర్కొంటున్నారు. అలాగే సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి సంబంధించి రూ. రెండు కోట్ల మేరకు పనులు జరగగా, బిల్లుల చెల్లింపులు రూ.80 లక్షల వరకు ఉంటుందని చెబుతున్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు

ఈ రెండు ఎత్తిపోతల పథకానికి కలిపి సుమారు రూ.4,427 కోట్ల వ్యయం అవుతుందని నీటిపారుదలశాఖ అంచనా వేసింది. అయితే ఈ నిధుల సమీకరణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చింది. నాబార్డు వంటి సంస్థల నుంచి నిధులను సేకరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ ఎత్తిపోతల పథకాల భవితవ్యం ఎలా ఉండబోతోందనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఇదీ పథకం..

సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలో 3.84 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ రెండు ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టిన విషయం విధితమే. కాళేశ్వరం ప్రాజెక్టు భాగమైన మల్లన్నసాగర్ జలాశయం నుంచి గోదావరి జలాలను సింగూరు జలాశయానికి తరలించి.. సింగూరులోని 24 టీఎంసీల నీటిని ఎత్తిపోసుకోవడం ద్వారా ఆయకట్టుకు సాగునీరిచ్చేలా ఈ పథకానికి రూపకల్పన చేశారు. ఈ పనులను మెఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ కంపెనీ దక్కించుకున్న విషయం విధితమే.

ఎలాంటి ఆదేశాలు రాలేదు

సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ఈ ఎత్తిపోతల పథకాలకు సంబంధించి పంప్‌హౌజ్‌ల నిర్మాణం పనులు చేపట్టాము. ఇక్కడ ప్రస్తుతానికి పనులు నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ రాగానే పనులు నెమ్మదించాయి. ఫలితాలు వచ్చిన తర్వాత నిలిచిపోయాయి.

– నీటి పారుదలశాఖ అధికారులు

బసవేశ్వర ఎత్తిపోతల పథకం..	
ప్రతిపాదిత ఆయకట్టు	: 1.65 లక్షల ఎకరాలు
ఎత్తిపోసుకునే నీటి పరిమాణం	: 8 టీఎంసీలు
మండలాల వారీగా ఆయకట్టు : రేగోడ్, వట్‌పల్లి, మానూర్, నాగల్‌గిద్ద, నారాయణఖేడ్, కంగ్టి, సిర్గాపూర్, కల్హేర్.	

సంగమేశ్వర ఎత్తిపోతల పథకం	
ప్రతిపాదిత ఆయకట్టు	: 2.19 లక్షల ఎకరాలు
ఎత్తిపోసే నీటి పరిమాణం	: 12 టీఎంసీలు
ఆయకట్టు మండలాలు : రాయ్‌కోడ్, మునిపల్లి, కోహిర్, ఝరాసంఘం, జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, సదాశివపేట్, కొండాపూర్, సంగారెడ్డి, కంది.	



హన్మంత్‌రావుపేటలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

కాళేశ్వరం పరిస్థితి ఏమైంది?

మంత్రి దామోదర రాజనర్సింహ

నారాయణఖేడ్: రాష్ట్రంలో రూ.1.30లక్షల కోట్లతో గత ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసు అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. నారాయణఖేడ్ మండలం హన్మంత్‌రావుపేట్, మన్సూర్‌పూర్‌లలో ప్రజాపాలనలో భాగంగా గ్రామ సభల్లో పాల్గొన్నారు. నారాయణఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బసవేశ్వర, సంగమేశ్వర ఎత్తిపోతల పథకాలను రద్దు చేస్తున్నట్లు వస్తున్న వార్తల విషయాలను విలేకరులు ప్రస్తావించగా.. కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నాణ్యమైన విద్య, వైద్యం సమాజానికి ప్రధానమైనందున ఆయా రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్న ఖాళీలను అంచెలంచెలుగా భర్తీ చేస్తామని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, ఇచ్చిన మాట నిలబెట్టుకునే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని పేర్కొన్నారు.

నల్లవాగు ఆరుతడికి నీటి విడుదల

ఈ సందర్భంగా నల్లవాగు ప్రాజెక్టు ద్వారా యాసంగిలో ఆరుతడి పంటలకుగాను 2,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని కలెక్టర్ శరత్‌ను మంత్రి ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు.

సమస్యలపై వినతులు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదరరాజనర్సింహ్మ మంగళవారం నారాయణఖేడ్ వచ్చిన సందర్భంగా ఆయనకు పలువురు వినతిపత్రాలను అందజేశారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని... అవినీతి, అక్రమాలపై సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించాలని మాజీ హెల్త్‌డైరెక్టర్ గడల శ్రీనివాస్‌రావు, లంబాడి హక్కులపోరాట సమితి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రకాష్‌రాథోడ్ మంత్రికి వినతులు అందించారు.

అమరుల కుటుంబాలకు అండగా..

న్యాల్‌కల్(జహీరాబాద్): తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులు, అమర వీరుల కుటుంబాలకు అండగా ఉంటామని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బసంత్‌పూర్ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తెలంగాణ అమరుల కుటుంబాలకు ఇంటి స్థలంతో పాటు ఉద్యోగం ఇప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

అధైర్య పడొద్దు..

మునిపల్లి(అందోల్): మండలంలోని తాటిపల్లి గ్రామంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దివంగత కనకారెడ్డి రెండో కుమారుడు వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులైన మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, మాజీ ఎంపీటీసీ సావిత్రమ్మలను మంత్రి దామోదర పరామర్శించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి అర్బన్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా 2024 క్యాలెండర్‌ను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ శరత్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు మాణిక్‌రావు, సంజీవరెడ్డి, లక్ష్మీకాంతరావు, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, డీఎం అండ్‌హెచ్‌ఓ గాయత్రీదేవి, జిల్లా అటవీశాఖ అధికారి శ్రీధర్, డీపీఓ సురేశ్ పాల్గొన్నారు.

సంగారెడ్డి/ పటాన్‌చెరు: నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి దామోదరకు పలువురు నేతలు, అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. టీఎన్‌జీఓ జిల్లా కార్యవర్గం, అడిషనల్ ఎస్పీ అశోక్ కూడా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

• మంత్రికి ఎస్పీ శుభాకాంక్షలు



నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎస్పీ రూపేష్ కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కలెక్టర్ శరత్‌ను, జిల్లా జడ్జి ప్రభాకర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి హ్యాపీ న్యూఇయర్ చెప్పారు. - సంగారెడ్డి

ఖేడ్ చైర్‌పర్సన్‌కు అవిశ్వాస గండం..!

- కాంగ్రెస్‌లోకి ముగ్గురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- అవిశ్వాసానికి రంగం సిద్ధం
- త్వరలో నోటీసు

నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన 7వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి, 8వ వార్డు కౌన్సిలర్ నర్సింహులు, 12వ వార్డు కౌన్సిలర్ మాజీద్‌లు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు బీఆర్‌ఎస్ నాయకులు శోభరాణి, జమీర్, తుకారాంలు వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖేడ్‌లో మున్సిపల్ ఎన్నికల్లో 15 వార్డులకు గాను 8మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలిచినట్లు తెలిపారు. ఎక్స్‌అఫిషియో ఓట్లతో ఐదుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉన్న మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకున్నారని అన్నారు. కాగా నేడు కాంగ్రెస్ కౌన్సిలర్ ఆనంద్ స్వరూప్ షెట్కార్ చైర్మన్ కానున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్ల చేరికతో 10మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ వైపు ఉన్నారని గుర్తు చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ మున్సిపాలిటీని గెలుచుకుంటుందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ కౌన్సిలర్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్ చైర్మన్‌గా ఎన్నిక అవడంతో పట్టణంలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. కౌన్సిలర్లు ఆనంద్‌స్వరూప్ షెట్కార్, శంకర్‌సేట్, వివేకానంద్, సద్దాం, హన్మంతు, నాయకులు రమేష్ చౌహాన్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న కౌన్సిలర్లు

కాంగ్రెస్ వశం కానున్న ఖేడ్ మున్సిపల్

బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరికతో 15మంది కౌన్సిల్ సభ్యుల బలంగల మున్సిపాలిటీలో 10మంది సభ్యులు కాంగ్రెస్ వైపు అయ్యారు. బీసీ జనరల్‌గా ఉన్న మున్సిపల్ చైర్మన్ స్థానం కాంగ్రెస్ వశం కానుంది. త్వరలో అవిశ్వాసం నోటీసు అందజేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఖేడ్ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్‌కు చెందిన ఏడుగురు కౌన్సిలర్లు అయిన రుబీనా నజీబ్ (15వ వార్డు కౌన్సిలర్, ప్రస్తుత చైర్‌పర్సన్), పరశురాం (5వ వార్డు, ప్రస్తుత వైస్ చైర్మన్), కవిత విఠల్, స్వప్న అభిషేక్ షెట్కార్, నూర్‌జహాన్ బేగం, సంధ్యారాణి రామకృష్ణ, మాజిద్‌లు గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి 8మంది కౌన్సిలర్లు ఆనంద్ స్వరూప్ షెట్కార్, లక్ష్మీబాయి, దారం శంకర్, వివేకానంద్, సబిత హన్మంతు, ఫరానా బేగం, రాజేష్‌చౌహాన్, నర్సింహులు గెలిచారు. అప్పటి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీల ఎక్స్‌అఫిషియో ఓట్లతో బీఆర్‌ఎస్‌కు చెందిన 15వ వార్డు కౌన్సిలర్ రుబీనా నజీబ్‌ను చైర్మన్‌గా, 5వ వార్డు కౌన్సిలర్ పరశురాంను వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. కొన్నాళ్లకు కాంగ్రెస్‌కు చెందిన 8వ వార్డు కౌన్సిలర్ నర్సింహులు బీఆర్‌ఎస్‌లో చేరారు. నేడు తిరిగి కాంగ్రెస్ గూటికి వచ్చారు. బీసీ జనరల్‌గా ఉన్న ఈ కౌన్సిల్ చైర్మన్‌గా 6వ వార్డు కౌన్సిలర్ ఆనంద్ స్వరూప్ షెట్కార్‌ను చైర్మన్‌గా ఎన్నుకునేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. కాంగ్రెస్ కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై త్వరలో అవిశ్వాసం నోటీసును కలెక్టర్‌కు అందజేయనున్నారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వైభవంగా దీపోత్సవం

మునిపల్లి(అందోల్): భగవంతుని సన్నిధిలో ప్రశాంతత లభిస్తుందని నర్సాపూర్ మండలం రుస్తుంపేట (నృసింహపురం) ఆత్మానంద ఆశ్రమ పీఠాధిపతి భగవద్భక్త పరాగ పూజ్య పాదగురు రాజయోగి వెంకటస్వామి తెలిపారు. మంగళవారం ఆయన టెక్మాల్ మండలం వెల్పుగొండ రామచలం గుట్ట సీతారామ దేవాలయంలో గణపతి పూజ, గురుపూజ, గోపూజ లక్ష దీపోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. దీపోత్సవంలో మునిపల్లి మండల ప్రజలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా

సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతం చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్: ఈనెల 8 9, 10వ తేదీలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయిసైన్స్ ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోని మహిళా డిగ్రీ కళాశాలలో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్, అగ్రికల్చర్ సహా మొత్తం ఐదు థీమ్‌లకు సంబంధించి ఎగ్జిబిట్స్ వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆంథోనీ రెడ్డి, సంగారెడ్డి మండల విద్యాధికారి వెంకట నరసింహులు, జిల్లా సైన్స్ ఆఫీసర్ విజయకుమార్, 11 కమిటీల కన్వీనర్లు పాల్గొన్నారు.

హోంగార్డుకు సన్మానం



హోంగార్డును సన్మానిస్తున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న రాజేశ్వరమ్మ మంగళవారం రిటైర్డ్ కావడంతో వన్‌టౌన్ పీఎస్ పరిధిలోని హోంగార్డు కార్యాలయంలో ఆమెను ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ ఘనంగా సన్మానించారు. అనంతరం మెమొంటో అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, డ్రైవర్ నరేందర్‌రెడ్డి, హోంగార్డులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలోని అన్ని గురుకులాల పరిధిలో 5వ తరగతి ప్రవేశాల దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈసందర్భంగా గురుకులాల అధికారులు మాట్లాడుతూ.. ఈనెల 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట డీఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, మెదక్ ఈస్ట్ రీజియన్ ప్రాంతీయ సమన్వయకర్త నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన పటాన్‌చెరు అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని శ్రీవాణినగర్ కాలనీకి చెందిన నాగ శిరీష జేఎంజే హైట్స్‌లో వాచ్‌మెన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డిసెంబర్ 30న భర్తతో సంక్రాంతికి స్వగ్రామమైన ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలం రాజుపాలెం గ్రామానికి వెళ్దామని చెప్పింది. అయితే పిండి వంటలు చేసుకొని వెళ్దాం అన్న విషయంలో భర్త దేవరాజుతో గొడవ పడింది. దీంతో క్షణిక వేశంలో నాగ శిరీష గడ్డికి కొట్టే మందు తాగింది. దీంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమె తండ్రి శీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మంచు కురిసిన వేళ..

అసలే శీతాకాలం.. ఆపై ఉదయం వేళల్లో మంచు కురుస్తోంది. మంగళవారం సిద్దిపేట పట్టణం కశ్మీర్‌ను తలపించింది. ఉదయం 8గంటలు దాటినా మంచు వీడ లేదు. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంచులో కోమటి చెరువు అందాలు కనువిందుచేశాయి. చిన్నకోడూరుతో పాటు రామునిపట్ల, రామంచ, చౌడారం తదితర గ్రామాలనూ మంచు కప్పేసింది.

– సిద్దిపేట/చిన్నకోడూరు



చిన్నకోడూరులో రోడ్డుపై పొగ మంచు



సిద్దిపేట పట్టణాన్ని కమ్మేసిన పొగమంచు



కోమటి చెరువు అందాలు..

కట్టపై నుంచి దూసుకెళ్లిన బైక్

వ్యాపారి మృతి

దుబ్బాక: బైక్ అదుపు తప్పి ఓ వ్యాపారి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణ శివారులో మంగళవారం దుంపలపల్లిలో వెలుగుచూసింది. ఎస్సై గంగరాజు కథనం ప్రకారం.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన కొండ బాలకృష్ణ(40) పట్టణంలో బ్యాంగిల్ స్టోర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. స్టోర్‌లో వస్తువులు కొనుగోలు చేయడానికి సోమవారం సాయంత్రం సిద్దిపేటకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా.. దుబ్బాక పట్టణ శివారులో చెరువు కట్టపై నుంచి బైక్ అదుపు తప్పి కిందికి దూసుకుపోయింది. తీవ్రంగా గాయపడిన అతను మృతి చెందాడు. మంగళవారం మధ్యాహ్నం అటుగా వెళ్తున్న రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య జయశ్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



బాలకృష్ణ మృతదేహం

కాగా, మృతుడు బాలకృష్ణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మద్యం సేవించి వలసకూలీ మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అతిగా మద్యం సేవించి వలస కూలీ మృతి చెందిన ఘటన కొల్లూరులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ముఖేశ్(26) మూడు నెలల క్రితం తెల్లాపూర్ పరిధిలోని కొల్లూరుకు వలస వచ్చి బ్రిక్స్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మిత్రులతో కలిసి అతిగా మద్యం సేవించి కింద పడిపోయాడు. ఎంతకీ లేవకపోవడంతో తోటి మిత్రులు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఏడుగురు వాహనదారులకు జిల్లా కోర్టు రూ.10 జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. ఆదివారం, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో వారిని పట్టుకున్నామని, మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారని సీఐ తెలిపారు.

గెజిటెడ్ లెక్చరర్స్ కార్యవర్గం

సిద్దిపేట ఎడ్యుకేషన్: తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్వసభ్య సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ వార్షిక నివేదికను చదివి వినిపించి, సంఘ భవిష్యత్ కార్యాచరణ పై సభ్యులు చర్చించారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గిరిరవి, ప్రధాన కార్యదర్శిగా దరిపల్లి నగేష్, ఆర్థిక కార్యదర్శిగా రాజు, మహిళా కార్యదర్శిగా రమాదేవి, ముఖ్య సలహాదారులుగా కొంతం రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రవి మాట్లాడుతూ తమపై నమ్మకంతో మరో రెండు సంవత్సరాల పాటు బాధ్యతలు అప్పగించిన ప్రాథమిక సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తమ శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ ఎన్నిక పరిశీలకులుగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి నాగేందర్, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు.

16 గ్రాముల గంజాయి పట్టివేత

ఏడుగురు నిందితుల అరెస్ట్, రిమాండ్

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని సిద్దాపూర్ కాలనీలో సోమవారం రాత్రి ఏడు ఎండు గంజాయి ప్యాకెట్లను(16గ్రాములు) స్వాధీనం చేసుకుని ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, మరొకరు పారిపోయారు. మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ నవీన్‌కుమార్ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ వాసులైన ఎండి హాజీ, అబ్దుల్ హాజీజ్, ఎండి మోషిన్, ఎండి సోహెల్, సయ్యద్ జహీర్, ఎండి నజీబురహమన్, ఎండి జాఫర్‌లు సోమవారం దూల్‌పేటలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేశారు. మూడు మూడు ఆటోలలో నూతన సంవత్సర సంబురాలు జరుపుకునేందుకు సదాశివపేటలోని సిద్దాపూర్ కాలనీకి చేరుకున్నారు. కాలనీలో ఫారుక్ ఇంటి సమీపంలో ఇర్ఫాన్ అనే స్నేహితుడితో కలిసి ఎనిమిది మంది గంజాయిని సేవించడానికి సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు రాత్రి 10 గంటల సమయంలో వారిని పట్టుకున్నారు. వీరిలో ఇర్ఫాన్ పారిపోగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7 గంజాయి ప్యాకెట్లు, మూడు ఆటోలు, ఒక స్కూటీ, 8 సెల్ ఫోన్లు, రూ.10,370 నగదు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వీరిలో నలుగురు నిందితులు మాదాపూర్, ఎస్ఆర్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, దొంగతనం కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వారిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్‌కుమార్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): తీవ్ర మనస్తాపంతో పురుగు మందు తాగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన కాసుకుంట కుమార్(40) గత నెల 24న ఆర్థిక పరమైన విషయంలో తన భార్యతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కుమార్ పరిస్థితి విషమించంతో మంగళవారం మృతి చెందాడు. అతడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

'డ్రిప్' అందేనా..!

- కొత్త ప్రభుత్వంపై రైతుల ఆశలు
- ప్రస్తుతం ఆయిల్‌పామ్‌కే అందజేత
- పండ్ల తోటలకు మొక్కుబడిగా సరఫరా
- అరటి, బొప్పాయి పంటలకు నిలిపివేత
- ఐదేళ్లుగా అమలుకు నోచుకోని పథకం

జహీరాబాద్: రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా డ్రిప్ పథకం అమలు చేస్తారనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. బిందు సేద్యం ద్వారా పంటలకు నీటి తడులను అందించేందుకు వీలుగా ప్రభుత్వం సబ్సిడీపై అందించే డ్రిప్ పరికరాల పథకం ఐదేళ్ల కాలంగా నిలిచిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని పరిమితం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. దీంతో పంటల సాగు రైతులకు భారంగా మారింది. జిల్లాలోని రైతులు పంటలకు నీటిని అందించేందుకు గాను డ్రిప్ సదుపాయానికి అలవాటు పడ్డారు. రెండు దశాబ్దాల కాలంగా రైతులకు అవగాహన కల్పించి డ్రిప్ విధానంలో పంట సాగును ప్రభుత్వాలు ప్రోత్సహించాయి. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, చిన్న, సన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ ఇవ్వగా.. పెద్ద రైతులకు 12 ఎకరాలకే పరిమితం చేయడంతో పాటు 80 శాతం మేర సబ్సిడీ ఇస్తూ వచ్చింది. ఈ విధానానికి ఐదు సంవత్సరాల కాలంగా బ్రేక్ పడింది. జిల్లాలో అత్యధికంగా జహీరాబాద్ రైతులు డ్రిప్ కింద పంటలను సాగు చేసుకుంటున్నారు.

7వేల దరఖాస్తులు పెండింగ్‌లో

సబ్సిడీ కింద డ్రిప్ కోసం ప్రతి ఏటా రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 7 వేల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 2019 నుంచి డ్రిప్ పరికరాల పంపిణీ నిలిపి వేశారు. అధికారులు మాత్రం 2,500 మేర దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. కంటి తుడుపు చర్యగా రెండేళ్ల కింద కేవలం 500 ఎకరాలకు మాత్రమే ఇచ్చారు. 2017 సంవత్సరం నుంచి రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. డ్రిప్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

ఆయిల్‌పామ్ సాగుకే పరిమితం

ప్రస్తుతం సబ్సిడీ కింద అందిస్తున్న డ్రిప్ పథకాన్ని కేవలం ఆయిల్ పామ్ పంటల సాగుకే ప్రభుత్వం పరిమితం చేసింది. ఈ ఏడాది జిల్లాలో 5వేల ఎకరాల్లో ఆయిల్ పామ్‌ను సాగులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నందున ఈ పంట సాగుకు ముందుకు వచ్చే రైతులకు మాత్రమే డ్రిప్‌ను అందించాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. ఇప్పటి వరకు ఈ పంట సాగు కోసం డ్రిప్ పరికరాలను అందించాలని కోరుతూ 1,200 మంది రైతులు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 675 ఎకరాలకు మంజూరు లభించగా 450 ఎకరాలకు సంబంధించి రైతులకు అందిస్తూ వస్తున్నారు. పక్షం రోజుల్లో పూర్తి స్థాయిలో అందించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.



ప్రైవేటుగా కొనుగోలు చేసి డ్రిప్ సదుపాయం కింద అల్లం విత్తనం వేస్తున్న కూలీలు(ఫైల్)

అరటి, బొప్పాయిలకు స్వస్తి

అన్ని రకాల పంటలకు ప్రభుత్వం డ్రిప్ పరికరాలను సబ్సిడీపై అందిస్తూ వచ్చినా రెండేళ్ల కాలంగా దీన్ని నిర్ణీత పండ్ల తోటలకు మాత్రమే పరిమితం చేసింది. పండ్ల తోటల్లో అరటి, బొప్పాయికి డ్రిప్ సదుపాయం కల్పించేందుకు స్వస్తి చెప్పింది. జామ, మామిడి, డ్రాగన్, అంజీర, సపోట పంటలకే అందిస్తోంది. అది కూడా పరిమితంగానే ఇస్తోంది. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో కేవలం 1,700 ఎకరాలకే అందించాలని నిర్ణయించింది. ఇందులో కేవలం 250 ఎకరాకు మాత్రమే మంజూరు లభించింది.

ప్రైవేటుగా పరికరాల కొనుగోళ్లు

ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్ పరికరాల సరఫరాను నిలిపి వేయడంతో రైతులు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటుగా డ్రిప్ కొనుగోలు చేసుకుంటున్నారు. ఇందు కోసం ఎకరాకు డ్రిప్ కోసం రూ.15 నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నా



ఐదేళ్ల క్రితం డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇందు కోసం రూ. 22వేల డీడీ సైతం చెల్లించా. అయినా ఇప్పటి వరకు డ్రిప్ పరికరాలు అందలేదు.

– అరవింద ప్రసాద్, రైతు, బూచనెల్లి

ఆయిల్‌పామ్‌కే అవకాశం



ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగుకే డ్రిప్ పథకాన్ని అందిస్తున్నాం. అందువల్లే దరఖాస్తులు తీసుకోవడం లేదు. సుమారు 2,500 మేర దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆయిల్‌పామ్ కోసం 675 ఎకరాలకు డ్రిప్‌ను మంజూరు చేశాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం డ్రిప్‌కు నిధులు కేటాయిస్తే అందిస్తాం.

–కె.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానవన అధికారి,సంగారెడ్డి

ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించండి

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనుల ఆరాధ్య దైవమైన సంతు సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న ప్రభుత్వం అధికారంగా సెలవు ప్రకటించాలని గోర్ సేన జిల్లా అధ్యక్షుడు అంగోతు రాజునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అనేక మార్లు డిమాండ్ చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో సుమారు 40లక్షల నుంచి 50లక్షల వరకు గిరిజన జనాభా ఉందన్నారు. కార్యక్రమంలో గోర్ సేన సభ్యులు భానోతు భాస్కర్‌నాయక్, హరిలాల్‌నాయక్, ముడావత్ తిరుపతినాయక్, ఇస్లావత్ జగన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోర్ సేన సభ్యులు

రిమాండ్

జహీరాబాద్ టౌన్: హత్యాయత్నం కేసులో ఓ నిందితుడికి రిమాండ్ విధించినట్టు జహీరాబాద్ టౌన్ సీఐ రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. డిసెంబర్ 31న మండలంలోని నత్వార్ గ్రామానికి చెందిన కల్పగూర్ నర్సింలు, అతడి మిత్రులు బొమ్మె యోగేశ్, బొమ్మె జనార్దన్, బిల్ల గుండప్ప, బిల్ల హరికృష్ణ చలి మంట కాసుకుంటుండగా అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన ఎరుపుల నర్సింలు మంటను ఆర్పడానికి ప్రయత్నించాడు. దీంతో బొమ్మె యోగేశ్ అభ్యంతరం తెలపడంతో ఆయనతో గొడవకు దిగాడు. మిత్రులు జోక్యం చేసుకుని నర్సింలును ఇంటికి పంపించారు. కాని మళ్లీ తిరిగి వచ్చి కత్తితో యోగేశ్‌పై దాడి చేశాడు. అడ్డం వచ్చిన కల్పగూర్ నర్సింలుపై కూడా దాడిచేసి అక్కడి నుంచి పారిపోయాడు. కల్పగూర్ నర్సింలు ఫిర్యాదు మేరకు చిరాగ్‌పల్లి ఎస్ఐ నరేశ్ ఎరుపుల నర్సింలును మంగళవారం అరెస్టుచేశారు. కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని సీఐ రాజు తెలిపారు.

'బడ్‌చిప్'.. బహుబాగు

- ఈ విధానంలో చెరకు సాగు లాభదాయకం
- పెట్టుబడి తగ్గి.. పెరగనున్న దిగుబడి

జహీరాబాద్: జిల్లాలో చెరకు సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోతుంది. పెట్టుబడులు పెరగడం, కూలీల కొరత తదితర సమస్యల కారణంగా ఈ పంటపై రైతులు విముఖత చూపుతున్నారు. ప్రస్తుతం ఒక ఎకరం చెరకు సాగుకు రూ.40వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

అయితే బడ్‌చిప్ విధానం (చెరకు ముచ్చెకళ్ళ నుంచి నారును పెంచి నాటే పద్ధతి) ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ పరిజ్ఞానం ద్వారా నాణ్యమైన చెరకు నారు నాటి లాభాలు పొందవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో చెరకు పంట సుమారు 50వేల హెక్టార్ల విస్తీర్ణంలో సాగవుతోంది. దీని ద్వారా 37లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుంది.



బడ్‌చిప్ విధానంలో నర్సరీలో పెంచుతున్న చెరకు మొలకలు

బడ్‌చిప్ విధానం

- బడ్‌చిప్ విధానం ద్వారా చెరకు విత్తనపు ఖర్చును దాదాపు నాలుగింట మూడోవంతు తగ్గించుకోవచ్చు.
- ఈ పద్ధతిలో కళ్ల ముచ్చలకు బదులుగా చెరకు కన్నులను మాత్రమే యంత్రం సహాయంతో వేరు చేసి విత్తనంగా వాడుకోవాలి. కన్నులు వేరు చేయగా మిగిలిన చెరకు గడలను బెల్లం లేదా పంచదార తయారీకి ఉపయోగించుకోవచ్చు.
- చెరకు గడల నుంచి కన్నులను అర్థ చంద్రాకారపు కత్తి సహాయంతో వేరు చేసుకుని అందులోని కుళ్లిన, నలిగిన వేరులు వచ్చిన, ఉబ్బెత్తుగా ఉన్న కన్నులను వేరు చేసి, మంచి చెరకు కన్నులను విత్తన శుద్ధి చేసుకుని ట్రేలలో అమర్చుకోవాలి.
- ప్లాస్టిక్ ట్రేలలో గుంతలను 1/3 వంతు వరకు కోకోపిట్‌తో నింపుకుని విత్తన శుద్ధి చేసిన కన్నులు పైకి ఉండేటట్లు వాలుగా ఉంచాలి.
- చెరకు మొలక శాతం తొందరగా రావడానికి ట్రేలను ఒకదానిపై ఒకటి వరుసగా పేర్చుకుని ప్లాస్టిక్ షీట్‌లో గాలి తగలకుండా కప్పాలి.
- మొలకెత్తిన ట్రేలను 4వ రోజు హరిత గృహంలోకి మార్చుకుని రోజు విడిచి రోజు క్యాన్‌తో అవసరాన్ని బట్టి తడుపుకోవాలి.
- విత్తు పొడువు 5.సెం.మీ ట్రె క్యావిటీ 98 సి.సి కలిగినవి అయిఉంటే మొలకలు 25–30 రోజుల వరకు ఆరోగ్యవంతంగా ఉండి మంచి దిగుబడి రావడానికి దోహదపడుతాయి.
- సామాన్యంగా మనుషుల సహాయంతో గాని లేదా మోటారుతో గాని పనిచేయబడే మిషన్‌లతో కన్నులను వేరు చేస్తారు.
- మనుషులతో గంటకు 250 కన్నులు, మోటారు సహాయంతో అయితే 800 కన్నుల వరకు వేరు చేయవచ్చు.
- బడ్‌చిప్ కట్టర్‌ను రూ.1500 ఖర్చుతో తయారు చేయించుకుని వాడవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నారును పెంచడానికి లేప తోటల నుంచి పురుగులు, తెగుళ్లు ఆశించని చెరకు గడలను ఎంపిక చేసుకోవాలి.
- ఉబ్బెత్తుగా ఉన్న, కుళ్లిన.. కన్నుల దగ్గర వేరులు వచ్చిన గడలను నారు కోసం వాడరాదు. మోడెం మరియూ నీటి ఎద్దడికి గురయిన చెరకు తోటలను నారు పెంచుకునేందుకు ఉపయోగించరాదు.



చెరకు గడల నుంచి తీసిన కన్నుల కణుపులు

ఉపయోగాలు

- నారు ద్వారా పెంచిన మొలకలు సాంద్ర పద్ధతి కంటే ఎక్కువ పిలకలు వస్తాయి, ఏకరీతిగా ఎదుగుదల ఉండి గడల సంఖ్య, గడ బరువుతో ఉంటుంది. చెరకు దిగుబడి పెరగడంతో పాటు చక్కెర శాతం అధికంగా ఉంటుంది.
- బడ్ చిప్ మొలకల ద్వారా నీరు, సమయం, కీలక వనరులను ఆదా చేయవచ్చు.
- ఎక్కువ దూరంలో మొలకలను నాటడం ద్వారా అంతర పంటలు వేయడం వలన అదనపు ఆదాయం చేకూరుతుంది.
- సేద్యంలో యాంత్రీకరణకు సౌకర్యంగా ఉండి, రైతులకు నికర ఆదాయం ఎక్కువ రావడానికి ఆస్కారముంటుంది.

ఈ విధానం ప్రయోజనకరం



బడ్ చిప్ విధానంలో చెరకు పంటను సాగు చేస్తే ఎంతో లాభదాయకంగా ఉంటుంది. చెరకు నుంచి కన్నులను వేరు చేయడం ద్వారా మిగిలిన చెరకును క్రషింగ్ నిమిత్తం కర్మాగారానికి పంపుకోవచ్చు. అంతే కాకుండా నెల రోజుల సమయం కూడా కలిసి వస్తుంది.

–వి.రమేష్, డీడీఎస్–కేవీకే పంట యాజమాన్య శాస్త్రవేత్త

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ఎంఏ.రజాక్ కథనం ప్రకారం.. పట్టణ శివారులోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థానం వెనకాల ఖాళీ స్థలంలో మహిళ మృతదేహం ఉందని అర్చకులు మహేశ్.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి వయసు 35 నుంచి 40 ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రుణం పేరిట సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: రుణం ఇప్పిస్తామని చెప్పి ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి సైబర్ మోసగాడు రూ.లక్ష 12 వేలు కాజేశాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ ఆర్ఆర్ హోమ్స్‌కు చెందిన ఓ వ్యక్తికి గతేడాది మే 5న రుణం ఇప్పిస్తామని ఫోన్‌కాల్ వచ్చింది. పెద్దమొత్తంలో రుణం కావాలంటే ప్రాసెసింగ్ ఫీజు నిమిత్తం ముందుగా రూ.1.12లక్షలు చెల్లించాలని చెప్పి తన ఖాతాలో వేయించుకున్నాడు. అయితే నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడం.. మరోవైపు అతని నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో గట్టిగా నిలదీశాడు. తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.